సాక్షి
ఖమ్మం
మంగళవారం । 11 । ఏప్రిల్ । 2023



ఖమ్మం డెయిరీ ప్రైవేటీకరణ?!
ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఖమ్మం విజయ డెయిరీని ప్రైవేటీకరించాలనే యోచనకు వచ్చినట్లు తెలుస్తోంది.
10లో



గంటలో ఇంటికి వచ్చేవారు..
తిరుమలాయపాలెం మండలానికి చెందిన మామిడి రైతుతో పాటు ఆటోడ్రైవర్ తొర్రూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.
8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
41° / 24°
జిల్లాలో మంగళవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. గంటగంటకు ఉష్ణోగ్రత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (మంగళవారం సా॥) 6.29
సహర్ (బుధవారం ఉ॥) 4.33

న్యూస్‌రీల్

కమిషనరేట్‌లో గ్రీవెన్స్



గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులు వింటున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ విష్ణు ఎస్.వారియర్ పాల్గొని పలువురి నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. ఎక్కువగా భూవివాదాలు, కుటుంబ తగాదాలకు సంబంధించి ఫిర్యాదులు ఉండగా, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని అధికారులను సీపీ ఆదేశించారు.

49మంది గైర్హాజరు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లాలోని 103 కేంద్రాల్లో సోమవారం పరీక్షకు 16,873మంది విద్యార్థులకు గాను 16,824మంది హాజరుకాగా, 49మంది గైర్హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. కాగా, తనతో పాటు అసిస్టెంట్ కమిషనర్ కలిపి ఎనిమిది కేంద్రాలను తనిఖీ చేసినట్లు వెల్లడించారు.

పెద్దాస్పత్రిలో వెంటిలేటర్ల పరిశీలన



వెంటిలేటర్‌ను పరిశీలిస్తున్న సాంకేతిక నిపుణులు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా జనరల్ ఆస్పత్రిలోని వెంటిలేటర్లను సోమవారం పీఎం కేర్స్ ప్రతినిధులు పరిశీలించారు. హైదరాబాద్ నుండి వచ్చిన ఇద్దరు సాంకేతిక నిపుణులు ఆస్పత్రిలోని 30 వెంటిలేటర్లను పరిశీలించి పనితీరుపై ఆరా తీశారు. చిన్నచిన్న సమస్యలు కొన్నింటికి మరమ్మతు చేశారు. ఎన్‌హెచ్‌ఎం నిధులతో వీటిని సమకూర్చగా, ప్రతీ ఆరు నెలలకోసారి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఫార్మసీ సూపర్‌వైజర్ రాజ్‌కుమార్, బయోమెడికల్ ఇంజనీర్ రవికుమార్ పాల్గొన్నారు.

జిల్లాలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ టోర్నీ



పవన్‌కుమార్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్: వచ్చే మే నెలలో రాష్ట్రస్థాయి సీనియర్ పురుషులు, మహిళల అథ్లెటిక్స్ పోటీలు ఖమ్మంలో నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ నున్నా రాధాకృష్ణ తెలిపారు. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరగగా ఆయన మాట్లాడారు. ఖమ్మంలో మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో అన్ని జిల్లాల క్రీడాకారులు హాజరయ్యేలా చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. అనంతరం అంతర్జాతీయ అథ్లెట్, అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కోటగిరి పవన్‌కుమార్‌ను సన్మానించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్‌తో పాటు చీఫ్ కోచ్ ఎం.డీ.గౌస్, ఎం.సుధాకర్, ఎస్.వెంకటేశ్వర్లు, సీహెచ్.కృష్ణయ్య, డి.రవికుమార్, ఎం.ఏ.హలీం, ఎం.డీ.ముజాహిద్, మాధవి, ఎస్.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పదునెక్కిన విమర్శలు



మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కనకయ్య, తదితరులు

బీఆర్ఎస్ నుంచి మాజీ ఎంపీ పొంగులేటి సస్పెన్షన్

- కొన్నాళ్లుగా పార్టీతో పాటు ముఖ్యమంత్రిపై ధిక్కార స్వరం
- కొత్తగూడెం సభలో సీఎం కేసీఆర్‌పై మరింత ఘాటు వ్యాఖ్యలు
- ఇప్పటికే మాజీ ఎంపీ వర్గీయులు – బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం
- త్వరలోనే రాజకీయ నిర్ణయం ప్రకటిస్తానని వెల్లడి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేశారు. ఈ ఏడాది మొదటి నుంచే బీఆర్ఎస్‌పై తిరుగుబాటు బావుటా ఎగురవేసి విమర్శలు ఎక్కుపెట్టిన ఆయనపై చివరకు చర్యలు తీసుకున్నారు. కొత్తగూడెంలో ఆదివారం జరిగిన సభ ఇటు బీఆర్ఎస్, అటు పొంగులేటి శిబిరంలో కాక పెంచగా.. సస్పెన్షన్ వ్యవహారం మరింత వేడెక్కించింది. పొంగులేటితో పాటు కొత్తగూడెం వేదికను పంచుకున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుపై వేటు వేస్తూ బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం సోమవారం ప్రకటన విడుదల చేసింది. ఈ నేపథ్యాన పొంగులేటి ఖమ్మంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి నేరుగా ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌పై మరింత ఘాటు వ్యాఖ్యలు చేశారు.

తొమ్మిది నియోజకవర్గాల్లో భేటీలు పూర్తి

బీఆర్ఎస్‌పై అసంతృప్తితో ఉన్న మాజీ ఎంపీ పొంగులేటి ఈ ఏడాది జనవరి 1వ తేదీన పార్టీపై ఉన్న అసమ్మతిని బయటపెట్టారు. ఆ తర్వాత నియోజకవర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తూ విమర్శల దాడి పెంచారు. ఖమ్మం మినహా ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల్లో భేటీలు పూర్తికాగా, కొన్ని నియోజకవర్గాల్లో అసెంబ్లీ అభ్యర్థులను కూడా ప్రకటించారు. ఇప్పటికే పొంగులేటి వెంట నడుస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడంతో విమర్శలు, ప్రతి విమర్శలు సాగుతున్నాయి. ఇదే సమయాన వైరా మున్సిపల్ చైర్మన్‌పై కూడా అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చారు.

2016 మే 4న టీఆర్ఎస్‌లోకి..

పాలేరు ఉప ఎన్నిక సందర్భంగా అప్పటి ఎంపీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి 2016 మే 4న టీఆర్ఎస్‌లో చేరారు. ఆయనతోపాటు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కూడా వెళ్లారు. సోమవారం పొంగులేటిని సస్పెండ్ చేయడంతో బీఆర్ఎస్‌లో దాదాపు ఏడేళ్ల ప్రయాణం ముగిసినట్లయింది. ఈ ప్రయాణం పొంగులేటికి రాజకీయంగా ఆశించిన స్థాయిలో కలిసి రాకపోగా, సిట్టింగ్ ఎంపీ అయి కూడా టికెట్ దక్కలేదు. చివరకు రాజ్యసభ స్థానం ఇస్తారని ఆశిస్తే నిరాశ ఎదురుకావడం.. అనుచర గణానికి తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం వంటి కారణాలు ఆయనకు అసంతృప్తిని కలిగించాయి. మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ గత పరాభవాలే ఎదురవుతాయన్న భావనతో ఆయన ముందుగానే దారి మార్చుకున్నట్లు రాజకీయంగా చర్చ జరుగుతోంది.

మిగిలింది ఖమ్మమే..

మూడున్నర నెలలుగా బీఆర్ఎస్‌తో పాటు ముఖ్యమంత్రి కేసీఆర్‌పై విమర్శలు సంధిస్తున్న పొంగులేటి.. ఆత్మీయ సమ్మేళనాలతో తన కేడర్ చేజారకుండా జాగ్రత్త పడ్డారు. ఇక ఖమ్మం సభ మాత్రమే మిగిలి ఉండటంతో ఎప్పుడు నిర్వహిస్తారు, ఆ భేటీలో ఏదైనా నిర్ణయం ప్రకటిస్తారా అని ఎదురుచూస్తున్నారు. మరోవైపు పలు మండలాల్లో ఆయన అనుచరులు, ఆయన వెంట నడుస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు పొంగులేటిని సస్పెండ్ చేసినట్లు తెలియగానే రాజీనామా బాట పట్టారు.

ఏ పార్టీలోకి వెళ్తారో ?

బీఆర్ఎస్ సస్పెన్షన్ నిర్ణయం ప్రకటించగానే శ్రీనివాసరెడ్డి ఘాటుగా స్పందించారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేయడంతోపాటు ఉమ్మడి జిల్లాలో ఏ ఒక్క బీఆర్ఎస్ ఎమ్మెల్యే గెలవరని, ఎవరినీ అసెంబ్లీ గేటు తాకనివ్వనంటూ సవాల్ విసిరారు. అయితే ఏదైనా పార్టీలో చేరడమా, సొంత పార్టీ పెట్టడమా అనే నిర్ణయాన్ని త్వరలోనే వెల్లడిస్తానని చెప్పడంతో పొంగులేటి తదుపరి రాజకీయ ప్రస్థానం ప్రస్తుతానికి ప్రశ్నార్థకంగానే మిగిలింది. కాగా, కొత్తగూడెం సభకు మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరు కావడం, త్వరలో మిగతా జిల్లాల్లో కూడా బీఆర్ఎస్ వ్యతిరేక శక్తులను కలుపుకుని సభలు పెడతామన్న పొంగులేటి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి.

‘ఈ–ఆఫీస్’లోనే ఫైళ్ల నిర్వహణ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ స్నేహలత, అధికారులు

- అన్ని శాఖల్లో అమలుచేయాల్సిందే..
- సమీక్షలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తమ కార్యాలయాల్లో ఫైళ్ల నిర్వహణను ఈ–ఆఫీస్ విధానంలో చేపట్టాలని.. ఇక నుంచి రాతపూర్వకంగా అందే ఫైళ్లను అంగీకరించేది లేదని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం వివిధ శాఖల జిల్లా అధికారులతో ఈ – ఆఫీస్ విధానం, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ–ఆఫీస్ విధానంతో భద్రతే కాక ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. కొన్ని శాఖల్లో ఇంకా కలెక్టరేట్‌కు ఫైళ్లు రాతపూర్వకంగా పంపిస్తున్నారని, అలాంటివి అంగీకరించబోమని తెలిపారు. కాగా, సొంత భవనాలు కలిగిన కార్యాలయాలు నూతన కలెక్టరేట్‌కు వచ్చినందున అక్కడి సామగ్రిని ఖాళీ చేయాలని, జీఓలు 58, 59పై ప్రజలకు అవగాహన కల్పించేలా శిబిరాలు ఏర్పాటుచేయాలని, గ్రామాల్లో డొంకలు, వ్యవసాయ క్షేత్రాల రహదారులపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంకా మామిడి పండ్లు కార్బైడ్ ద్వారా మాగబెట్టకుండా తనిఖీలు చేయాలని సూచించారు.

ఫిర్యాదులు పరిష్కరించండి

ప్రజలు అందిస్తున్న ప్రతీ ఫిర్యాదును పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి(గ్రీవెన్స్‌డే)లో సోమవారం ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి అధికారులకు సూచనలు చేశారు. కాగా, తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడుకు చెందిన పిల్లి విజయ్‌కుమార్ తన భూమిలో కొంత పక్క రైతు కలుపుకున్నందున సర్వే చేయాలని, కొణిజర్ల మండలం గోపతికి చెందిన తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవేలో కోల్పోయిన భూమిలోని పైపులకు పరిహారం ఇప్పించాలని, బోనకల్ మండలం నారాయణపురానికి చెందిన కె.కనకారావు తన భూమికి పాస్ బుక్ ఇప్పించాలని కోరారు.

సవరణలు త్వరగా పూర్తి చేయాలి

అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతుల సర్వే వివరాల్లో తేడా ఉంటే సవరణలు త్వరగా పూర్తిచేసి నివేదిక అందజేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల, ఉద్యానవన శాఖ అధికారి అనసూయ తదితరులతో సమావేశమైన ఆయన పంట నష్టం సర్వే, నివేదికలు ఆరా తీశాక పలు సూచనలు చేశారు.

నియోజకవర్గానికి 300మంది..

హైదరాబాద్‌లో భారతరత్న అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ ఈనెల 14న జరగనున్నందున నియోజకవర్గానికి 300మంది చొప్పున తీసుకెళ్లాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి ఆయన నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. నియోజవర్గం నుండి 300 మందిని తీసుకెళ్లేందుకు ఆరు చొప్పున బస్సులు ఏర్పాటుచేయాలని, ప్రతీ బస్సు వెంట ఒక అధికారి వెళ్లాలని తెలిపారు. అలాగే, కార్యక్రమానికి వచ్చే వారికి భోజనం, ఇతర సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్ స్నేహలత, అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా, డీఆర్వో శిరీష, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, పశుసంవర్ధక శాఖ జేడీ వేణుమనోహర్, డీఆర్డీఓ విద్యాచందన, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ సత్యనారాయణ, ఆర్డీఓ కిషన్‌రావు, ఏసీపీ ప్రసన్న కుమార్, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.శ్రీరాం, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు, ఆర్డీఓ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న ఎండలు

42.5 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత

ఖమ్మంగాంధీచౌక్: ఎండ తీవ్రత జిల్లాలో సోమవారం మరింతగా పెరిగింది. ఆదివారం 39.9 డిగ్రీలుగా ఉన్న ఎండ సోమవారానికి 42.5 డిగ్రీలకు చేరింది. ఈనెల మొదటి నుంచి ఆదివారం వరకు 35–40 డిగ్రీల మధ్యలోనే ఉష్ణోగ్రత నమోదైంది. అయితే, 6వ తేదీన 40 డిగ్రీలుగా నమోదైన ఉష్ణోగ్రత ఆతర్వాత కాస్త తగ్గింది. ఇక సోమవారం ఉదయం ఏడు గంటల వరకు వాతావరణం కాస్త చల్లగానే కనిపించింది. ఆతర్వాత ఎనిమిది గంటల నుంచి ఎండ మొదలు కాగా.. నేలకొండపల్లిలో అత్యధికంగా 42.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ తీవ్రత పెరగడంతో అత్యవసర పనులుంటే తప్ప పగటి వేళ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు.



సోమవారం 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

ఉష్ణోగ్రత	ప్రాంతం
42.5	నేలకొండపల్లి
42.1	తిమ్మారావుపేట (ఏన్కూరు)
41.5	ప్రకాష్‌నగర్ (ఖమ్మం అర్బన్)
40.9	రావినూతల (బోనకల్)
40.6	ఖానాపురం (ఖమ్మం అర్బన్)
40.6	పమ్మి (ముదిగొండ)
40.6	పల్లెగూడెం (ఖమ్మం రూరల్)
40.4	సత్తుపల్లి
40.3	ముదిగొండ
40.2	కూసుమంచి
40.2	ఎన్ఎస్‌పీ గెస్ట్‌హౌస్ (ఖమ్మం అర్బన్)

ఇళ్ల పట్టాలు ఇవ్వాలంటూ ఆందోళన

- రామన్నపేటలో ఎమ్మెల్యేను అడ్డుకున్న స్థానికులు
- అర్హులకు అన్యాయం జరిగిందని మొర

ఖమ్మంరూరల్: ఏళ్లుగా ఇళ్ల పట్టాల కోసం కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నా పట్టాలు ఎందుకు ఇవ్వడంలేదంటూ మండలంలోని రామన్నపేట వాసులు ఆందోళనకు దిగారు. మండలంలోని దానవాయిగూడెం, రామన్నపేట, కైకొండాయిగూడెం ప్రజలకు మంజూరైన ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సోమవారం రామన్నపేటలోని రైతువేదికకు వెళ్తున్నారు. దీంతో మార్గమధ్యలోనే ఇళ్ల పట్టాలు రాని వారు ధర్నాకు దిగారు. కేవలం రాజకీయ నాయకులు, కార్పొరేటర్లు చెప్పిన వారికే పట్టాలు ఇస్తుండగా.. అర్హులకు అన్యాయం జరుగుతోందని వారు ఆరోపించారు. ఈవిషయంలో ఏదో ఒకటి ఇప్పుడే తేల్చాలని డిమాండ్ చేశారు. అంతేకాక రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి ఇదే ప్రాంతంలో ఇళ్లు నిర్మిస్తామన్న హామీపై స్పందించాలని కోరారు. కాగా, ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు పక్కకు తప్పించే ప్రయత్నం చేయడంతో వాగ్వాదం జరిగింది. చివరకు ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి కల్పించుకుని స్థానికులతో చర్చించారు.



పట్టాలు రాలేదని ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డితో వాగ్వాదానికి దిగిన స్థానికులు

ఎవరి మాటలు వినకండి

ధర్నా చేస్తున్న వారితో ఎమ్మెల్యే ఉపేందర్ మాట్లాడుతూ సమస్య ఉందని పారిపోవడం, పోలీసులను అడ్డుపెట్టుకుని రావడం తన నైజం కాదని చెప్పారు. ఏ సమయమైనా తాను అందుబాటులో ఉంటుండగా, రోడ్లపైకి చేరి ధర్నా చేయడం సరికాదన్నారు. రామన్నపేటలో ఇంకా అర్హులు ఉంటే తప్పకుండా పట్టాలు ఇస్తామని తెలిపారు. ఎవరో చెప్పిన మాటలు విని ధర్నా చేయడమో, రోడ్డుపైకి చేరి గోల చేస్తేనో పట్టాలు రావని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే రామన్నపేట వెళ్లి లబ్ధిదారులకు పట్టాలు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు.

‘ఎర్లీ బర్డ్’తో పన్ను చెల్లింపుదారులకు మేలు

- కేఎంసీ పరిధిలో 49,006 మంది అర్హులు
- ఈనెల 30వరకు పన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ
- కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం ప్రకటించిన ఎర్లీ బర్డ్ పథకంతో మేలు జరుగుతుందని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి తెలిపారు. ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది ఎర్లీ బర్డ్ పథకం ఈనెల 30వ తేదీ వరకు అమల్లో ఉంటుందని, ఈలోగా ఆస్తి పన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ వర్తిస్తుందని చెప్పారు. అలాకాకుండా ఆలస్యంగా చెల్లిస్తే జరిమానా విధించే అవకాశమున్నందున నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ విషయమై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 22 మంది బిల్ కలెక్టర్లను కేటాయించి ఎర్లీ బర్డ్ ద్వారా పన్నుల వసూళ్లపై దృష్టి సారించామని వివరించారు.

ఇప్పటికే రూ.1.06కోట్ల వసూలు

ఎర్లీ బర్డ్ పథకం ద్వారా పన్నులు చెల్లించేందుకు గత ఆర్థిక సంవత్సరం బకాయి లేని వారే అర్హులని కమిషనర్ ఆదర్శ్ సురభి వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 49,006 మంది అర్హులుగా గుర్తించగా, వీరందరూ ఐదు శాతం రాయితీతో పన్ను చెల్లించే అవకాశముందని తెలిపారు. కాగా, వీరి నుంచి రూ.20.35 కోట్లు పన్నులు కావాల్సి ఉండగా, ఆదివారం నాటికి రూ.1.06 కోట్లు చెల్లించారని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం ఎర్లీ బర్డ్ స్కీంలో 49,045 మంది అర్హులు ఉండగా.. రూ.3.55 కోట్లు వసూలయ్యాయని గుర్తు చేశారు. ఈసారి కూడా ప్రజలు సద్వినియోగం చేసుకునేలా వాట్సప్ ద్వారా మెసేజీలు పంపించడమే కాక పోస్ట్ ద్వారా నోటీసులు జారీ చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. అనంతరం రాయితీపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్ఓ జి.శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.



రాయితీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కమిషనర్ ఆదర్శ్ సురభి, ఆర్ఓ శ్రీనివాస్

రాష్ట్రంలో లిక్కర్, లీకేజీల పాలన

- ఈనెల 18న మహాధర్నాను జయప్రదం చేయండి
- అఖిలపక్ష సమావేశంలో టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలో లిక్కర్, లీకేజీల పాలన సాగుతోందని తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన అఖిలపక్ష పార్టీల సదస్సులో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించడమే కాక చైర్మన్, సభ్యులను తొలగించాలని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల ప్రాతిపదికన ఏర్పడిన తెలంగాణలో ప్రశ్నపత్రాలను సైతం ఆదాయవనరుగా మార్చారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ పాలన మొత్తం కమీషన్లు దండుకోవడం తప్ప మరేమీ లేదని ఆరోపించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ నష్టపోయిన అభ్యర్థులకు రూ.లక్ష చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా, ‘నిరుద్యోగ గోస – అఖిలపక్షం భరోసా’ పేరిట ఈనెల 18న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మహాధర్నాను జయప్రదం చేయాలని కోదండరాం కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరావు, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఉపేందర్ సాహూ, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.రాజేంద్రప్రసాద్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నలమూరు తిరుమలరావు తదితరులు మాట్లాడగా వివిధ పార్టీల నాయకులు రాయల నాగేశ్వరరావు, మహ్మద్ జావేద్, పుచ్చకాయల వీరభద్రం, మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, పల్లెబోయిన చంద్రం, దొబ్బల సౌజన్య, గోపగాని శంకర్‌రావు, బాబు, ఆవుల అశోక్, ఆజాద్, వెంకటేష్, మస్తాన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, పక్కన పోట్ల నాగేశ్వరరావు తదితరులు

14న మంచిర్యాలలో బహిరంగ సభ

- జిల్లా నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలి
- డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, భట్టి సతీమణి నందిని

ఖమ్మం సహకారనగర్: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్‌లో భాగంగా ఈనెల 14న మంచిర్యాలలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, భట్టి సతీమణి మల్లు నందిని వెల్లడించారు. ఖమ్మంలోని భట్టి క్యాంపు కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో ప్రశ్నాపత్రాల లీకేజీల పరంపర నడుస్తుండగా.. ఎన్నో ఆశలతో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నిరుద్యోగులు నిరాశలో కూరుకుపోయారని తెలిపారు. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో బీజేపీ, బీఆర్ఎస్ నేతలు యువత జీవితాలతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. కాగా, ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని పార్లమెంట్ నుంచి బహిష్కరించడాన్ని నిరసిస్తూ ఈనెల 14వ తేదీన మంచిర్యాలలోని ప్రగతిమైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నన్నట్లు తెలిపారు. ఈసభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరవుతున్నారని.. జిల్లా నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలని దుర్గాప్రసాద్, నందిని కోరారు. కాగా, భట్టి విక్రమార్క రాష్ట్రంలోని ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో ప్రభుత్వ అక్రమాలను వివరించేందుకు చేపట్టిన యాత్రకు మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇవ్వనున్నట్లు ప్రకటించిన నేపథ్యాన ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధమవుతున్నారని చెప్పారు. అయితే, కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో అధికారంలోకి ఉన్న బీఆర్ఎస్ నేతలు ప్రజలను దోచుకుంటున్నారని, హామీల అమలును విస్మరించిన విషయాన్ని ప్రజలు గుర్తించారని తెలిపారు. ఈసమావేశంలో నాయకులు అంబటి వెంకటేశ్వరరావు, కొమ్మినేని రమేష్, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, గాలి దుర్గారావు, మహ్మద్ జావీద్, రాయల నాగేశ్వరరావు, దొబ్బల సౌజన్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎల్పీ నేత సతీమణి నందిని, పక్కన డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

పెద్దాస్పత్రిలో కరోనా మాక్‌డ్రిల్

ఖమ్మం వైద్యవిభాగం: కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యాన ప్రభుత్వం ఆదేశాల మేరకు సోమవారం ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. కరోనా కేసులు పెరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సకు ఉన్న సౌకర్యాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఆస్పత్రిలో మొత్తం 600 ఆక్సిజన్ బెడ్లు సిద్ధం చేయగా, గర్భిణులకు 40, చిన్నారులకు 40 కోవిడ్ బెడ్లు ప్రత్యేకంగా కేటాయించినట్లు తెలిపారు. అలాగే లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంక్, సిలిండర్లను పరిశీలించిన ఆయన నిల్వలపై సూచనలు చేశారు. నిత్యం 100కు పైగా ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేయాలని, అవసరం మేరకు ర్యాపిడ్ టెస్టులు కూడా పెంచాలని సూచించారు.



ఆక్సిజన్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

క్లుప్తంగా

సమాజంతో మిళితమైన సాహిత్యం



మాట్లాడుతున్న ఖాసీం

ఖమ్మం సహకారనగర్: సాహిత్యం సమాజంతో మిళితమై ఉంటుందని.. మానవ ఉద్వేగాన్ని, సాహిత్య ప్రక్రియల ద్వారా వక్తమవుతుందని ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ సి.ఖాసీం అన్నారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన 'తెలుగు సాహిత్యంపై అంబేద్కర్ ప్రభావం' అంశంపై మాట్లాడారు. ఈకార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డాక్టర్ జె.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ బీ.వీ.రెడ్డితో పాటు జీవన్, కిరణ్‌కుమార్, డాక్టర్ సీతారాం, అనురాధ, మేఘమాల, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగి ఇంట్లో చోరీ



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ

కారేపల్లి: కారేపల్లిలోని వెంకటసాయినగర్ వెంచర్‌లో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. ఇందులో ఒకరి ఇంట్లో రూ.2.40లక్షల విలువైన ఆరు తులాల బంగారు ఆభరణాలను దుండగులు ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటసాయినగర్‌లో డోర్నకల్‌కు చెందిన రైల్వే ఉద్యోగి బంక శాంతకుమార్ అద్దెకు ఉంటున్నాడు. ఇల్లెందులో విధులు నిర్వర్తించే ఆయన శనివారం స్వగ్రామానికి వెళ్లి సోమవారం ఉదయం తిరిగి వచ్చారు. అయితే, ఇంటి తలుపు, లోపల బీరువా తాళాలు పగులగొట్టి ఉండడంతో పరిశీలించగా రూ.2.40లక్షలు విలువైన ఆరు తులాల బంగారం చోరీ గురైనట్లు గుర్తించారు. అలాగే, అదే లైన్‌లో నివాసముంటున్న నర్సింగ్ కుటుంబం సైతం తాళం వేసి ఊరు వెళ్లగా దుండగులు ప్రవేశించినప్పటికీ ఏమీ దొరకకపోవడంతో వెళ్లిపోయారు. ఆయా గృహాలను సింగరేణి సీఐ నూనె వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు పుష్పాల రామారావు, కిరణ్‌కుమార్, క్లూస్ టీం, సీసీఎస్ సిబ్బందితో కలిసి పరిశీలించారు.

గ్యాస్ స్టౌ పేలి ఒకరు మృతి

ఆమ్లెట్ వేసుకునేందుకు వెలిగించగా ఘటన

తిరుమలాయపాలెం: గ్యాస్ స్టౌ పేలడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని దమ్మాయిగూడెంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దమ్మాయిగూడెంకు చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ సూతగాని ప్రసాద్(38) రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంట్లో ఉంటున్నాడు. సోమవారం ఉదయం ఆయన ఒకరే ఇంట్లో ఉండగా, ఆమ్లెట్ వేసుకునేందుకు స్టౌ వెలిగించగా ప్రమాదవశాత్తు పేలింది. దీంతో మంటలు వ్యాపించి ప్రసాద్ ఒంటికి అంటుకుని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సుజితతో పాటు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గ్యాస్ పైపు లీకేజీతో అగ్నిప్రమాదం

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో వేమా శ్రీనివాసరావుకు చెందిన హోటల్‌లో ప్రమాదవశాత్తు గ్యాస్ పైపు లీక్ కావడంతో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. హోటల్ సోమవారం వంట చేస్తుండగా పైపు నుంచి గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికులు స్పందించి ఆర్పేశారు. అప్పటికే హోటల్‌లోని సామాగ్రి, విద్యుత్ వైర్లు కాలిపోయినా ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కట్నం వేధింపులపై కేసు

కల్లూరు: భర్త, కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ వివాహిత ఇచ్చిన ఫిర్యాదుతో కల్లూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. కల్లూరు అంబేద్కర్‌నగర్‌కు చెందిన తాళ్ల సౌజన్యను ఆమె భర్త సిద్ధం నాగరాజు, అత్తమామలు, ఆడపడుచు పంకంజం వరకట్నం కోసం వేధిస్తున్నారు. దీంతో సౌజన్య చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై రఘు తెలిపారు. కాగా, నాగరాజు తనను బావమరుదులు తాళ్ల రాంబాబు, రాములు మాట్లాడాలని పిలిచి బీరు సీసాతో దాడి చేయగా గాయాలయ్యాయని మరో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేశామని ఎస్సై వెల్లడించారు.

భూఆక్రమణపై...

ఖమ్మం అర్బన్: ఖమ్మం ప్రశాంత్‌నగర్‌కు చెందిన రాజేష్ తన భూమిని నాగేశ్వరరావు, ఈశ్వర్, మరో ముగ్గురు ఆక్రమించే ప్రయత్నం చేశారని పోలీసులను ఆశ్రయించాడు. దీంతో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	1,830	1,825
పెసలు	7,400	5,200
కందులు	8,000	5,200
మిర్చి	23,600	17,000
మిర్చి తాలు	15,000	9,000
పత్తి	7,900	6,300

– ఖమ్మం వ్యవసాయం

సీఎంను తూలనాడడంతోనే బహిష్కరణ

- ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలే టార్గెట్‌గా పొంగులేటి కుట్ర
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



సత్తుపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సత్తుపల్లి: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆత్మీయ సమ్మేళనాల పేరుతో తీరుతెన్నులు లేకుండా వెళ్తూ సీఎం కేసీఆర్‌ను ఇష్టం వచ్చినట్లు విమర్శిస్తుండడంతోనే బహిష్కరణ వేటు పడిందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు జాతీయ పార్టీలు తనకోసం ఎదురు చూస్తున్నాయంటూ ఆ పార్టీలను అవమానిస్తున్నారన్నారు. తండ్రి వయస్సు కలిగిన సీఎం కేసీఆర్‌ను విమర్శించినా సంయమనంతో ఓపిక పట్టామని, నాలుగేళ్లు సీఎం కేసీఆర్ పథకాలు బాగున్నాయని మెచ్చుకుని ఇప్పుడు విమర్శలు చేయడం ఏమిటో చెప్పాలని సూచించారు. పార్టీలు మారడాన్ని తప్పు తప్పుపట్టడం లేదని.. తాను టీడీపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరినా ఏనాడూ చంద్రబాబునాయుడిని విమర్శించలేదన్నారు. కాగా, సత్తుపల్లి మినహా ఎస్సీ, ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గాలే టార్గెట్‌గా పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభ్యర్థులను ప్రకటించారని.. కొత్తగూడెం, పాలేరు, ఖమ్మంలో ఎందుకు ప్రకటించలేదో చెప్పాలని సూచించారు. ఈసమావేశంలో మున్సిపల్, ఆత్మ కమిటీ చైర్మన్లు కూసంపూడి మహేష్, వనమా వాసుతో పాటు కొత్తూరు ఉమామహేశ్వరరావు, దొడ్డా శంకర్‌రావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, యాగంటి శ్రీనివాసరావు, ఎస్.కే.రఫీ, మల్లూరు అంకమరాజు, మానుకోట మధు, వీరపనేని బాబీ పాల్గొన్నారు.

లయ తప్పి సీఎం కేసీఆర్‌పై విమర్శలు..

- వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్



వైరాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాములునాయక్

వైరా: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మతిభ్రమించి లయ తప్పి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అవాకులు, చెవాకులు పేలుతున్నారని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ విమర్శించారు. వైరాలో సోమవారం ఆయన మాట్లాడుతూ సీఎంపై పొంగులేటి చేసిన అనుచిత వాఖ్యలు గర్హనీయమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని శాసించాలనే ఉన్మాదంతో ఆయన మాట్లాడుతున్నారని తెలిపారు. అయితే, డబ్బు రాజకీయం ఎంత కాలం పని చేస్తుందో ప్రజలు గమనిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో పనిచేసే నైతికత పొంగులేటికి లేదని చెప్పారు. ఇంకా ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వర్లు, ఎంపీపీ వేల్పుల పావనితో పాటు బీడీకే.రత్నం, బీబా సాహెబ్, పసుపులేటి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ధన రాజకీయాలు జిల్లాలో సాగవు

- జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

మధిర: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధన రాజకీయాలు ఖమ్మం జిల్లాలో సాగవని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ హెచ్చరించారు. మండలంలోని మాటూరుపేటలో ఆయన మాట్లాడుతూ పార్టీ జెండా, అజెండా లేకుండా డబ్బు ఆశ చూపి పొంగులేటి ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్‌ను విమర్శించినంత మాత్రాన పెద్ద నాయకుడు కాలేరనే విషయాన్ని గుర్తించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాలో బీఆర్ఎస్ అభ్యర్థులు ఏకపక్ష విజయాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈసమావేశంలో విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఆత్మ కమిటీ చైర్మన్ గుర్రం రామారావుతో పాటు రావూరి శ్రీనివాసరావు, రావూరి శివ నాగకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఓడించే శక్తి పొంగులేటికి లేదు..

- పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి: జిల్లా నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ మెట్లు ఎక్కకుండా చూస్తానని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పడం హాస్యాస్పదమని.. ఆయనకు అంత శక్తిలేదని పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ మారాలనుకుంటే వెళ్లిపోవాలే తప్ప ఇంతకాలం కొనసాగిన పార్టీ, నేతలపై విమర్శలు చేయటం సరికాదన్నారు. కాంగ్రెస్‌లో గెలిచి అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌లో చేరిన తాను ఏనాడు కూడా ఆ పార్టీ నేతలను విమర్శించలేదని గుర్తు చేశారు. ఎవరు ఔనన్నా, కాదన్నా వచ్చే ఎన్నికల్లో పది సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్, జెడ్పీటీసీ సభ్యుడు వరప్రసాద్‌తో పాటు రామసహాయం బాలకృష్ణారెడ్డి, వేముల వీరయ్య, బెల్లం వేణు, ఉన్నం బ్రహ్మయ్య, బాషబోయిన వీరన్న, ఆసిఫ్‌పాషా చాట్ల పరుశురాం, కాసాని సైదులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ఆయువు పోసిన వైద్యులు

ఖమ్మం వైద్యవిభాగం: అకస్మాత్తుగా గుండెపోట్లు, అకాల మరణాలు చోటుచేసుకుంటున్న తరుణాన ఓ గర్భిణి అదే తరహా సమస్యతో ఖమ్మం ప్రభుత్వ ప్రధానాస్పత్రిలో చేరింది. రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యాన ఇన్సెంటివ్ కేర్ యూనిట్ వైద్యుల బృందం ఆమెకు పునర్జన్మ ప్రసాదించింది. వివరాలిలా ఉన్నాయి. నేలపట్లకు చెందిన ప్రవళిక పెద్దాస్పత్రిలోని ఎంసీహెచ్‌లో సోమవారం మగ శిశువుకు జన్మనిచ్చింది. అయితే ఆమెకు శస్త్ర చికిత్స ముందు ఆరోగ్యం నిలకడగానే ఉండగా.. వార్డుకు తరలించే సమయాన మూర్ఛ వచ్చింది. దీంతో సిబ్బంది అప్రమత్తం కాగా రెండోసారి మూర్ఛ రాగా స్పృహ కోల్పోయింది. దీంతో వైద్యులు ఆమెకు వైద్యులు విమల, జ్యోత్స్న, మానస సీపీఆర్ చేయగా రక్తపోటు, నాడీ స్పందన నమోదు కాగానే ఐటీయూకు తరలించారు. అక్కడ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యాన చేసిన చికిత్సతో ప్రవళిక కోలుకుంది. ఈమేరకు వైద్యబృందాన్ని మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ బి.శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తికి బ్రెయిన్‌డెడ్

అవయవదానానికి అంగీకరించిన కుటుంబం

ఖమ్మం అర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఖమ్మం – ఇల్లెందు రోడ్డులో గత శనివారం ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఎం.లక్ష్మయ్య(60)ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనకు ఖమ్మంలోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకపోగా.. బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈమేరకు అవయదదానానికి కుటుంబీకులను ఒప్పించిన జీవన్‌దాన్ ప్రతినిధులు అంబులెన్స్‌లో సోమవారం హైదరాబాద్ తరలించారు. ఆయన అవయవాలను అవసరమైన వారికి మంగళవారం అమర్చనున్నట్లు తెలిసింది.

గంటలో ఇంటికి వచ్చేవారు...

- మామిడికాయలు అమ్మి వస్తుండగా గాలిలో కలిసిన ప్రాణాలు
- ట్రాలీ ఆటోను గ్రానైట్ లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మృతి
- మృతులు తిరుమలాయపాలెం మండల వాసులు



ఆటో డ్రైవర్ రమేష్ (ఫైల్)



ఆటో క్యాబిన్‌లో రమేష్ మృతదేహం

తిరుమలాయపాలెం/తొర్రూరు రూరల్: మామిడి తోట విరగ కాసింది.. గాలిదుమారం రాకముందే అమ్ముకుని అప్పులు తీర్చుకుందామని ఆ రైతు భావించాడు.. ట్రాలీ ఆటోలో కాయలు తీసుకుని వరంగల్‌లో అమ్మి తిరుగుముఖం పట్టాడు. కానీ గ్రానైట్ లారీ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు రైతుతో పాటు ఆటో డ్రైవర్‌నూ బలి తీసుకుంది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం నాంచారిమడూరు శివారులో సోమవారం ఉదయం ఈ ప్రమాదం జరగగా ఇంకో గంటలో ఇళ్లు చేరాల్సిన జిల్లాలోని తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లికి చెందిన ఇద్దరు మృత్యువాత పడ్డారు. వివరాలిలా ఉన్నాయి.

రెండు కుటుంబాల్లో విషాదం

జల్లెపల్లికి చెందిన రైతు తేజావత్ వెంకన్న(45) మామిడికాయలను వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో అమ్మేందుకు అజ్మీరా తండాకు చెందిన ట్రాలీ ఆటోడ్రైవర్ బర్మావత్ రమేష్(27)తో కలిసి ఆదివారం రాత్రి వెళ్లాడు. అక్కడ సోమవారం ఉదయం మామి డి కాయలు అమ్మగానే తిరుగుముఖంపట్టారు. మార్గమధ్యలో తొర్రూరు మండలం నాంచారిమడూరు శివారుకు వచ్చే సరికి ఖమ్మం నుంచి వరంగల్ వైపు వెళ్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన గ్రానైట్ లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఘటనలో ఆటో ముందుభాగంలో కూర్చున్న వెంకన్న రోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే, ఆటో నడుపుతున్న రమేష్ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయి కన్నుమూశాడు. ఆయన తల ముందు భాగమంతా ఛిద్రమై గుర్తుపట్టలేని విధంగా మారిపోయింది. సమాచారం తెలుసుకున్న ఎస్సైలు సతీష్, లింగారెడ్డి చేరుకొని మృతుల వివరాలు సేకరించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చా రు. కాగా, రైతు వెంకన్నకు భార్య బుజ్జి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోవడంతో వారు దిక్కులేని వారయ్యారు. అలాగే, బర్మావత్ రమేష్ తల్లిదండ్రులు తులస్య, నాగమ్మతో ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు పెళ్లి సంబంధాలు చూస్తున్న తరుణంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

బ్యాంక్‌లో ఖాతాదారుడి హల్‌చల్

నేలకొండపల్లి: మద్యం మత్తులో బ్యాంకుకు వచ్చిన ఓ ఖాతాదారుడు సిబ్బందిపై విరుచుకుపడడంతో బ్యాంక్ ఆయనను పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లిలోని ఎస్‌బీఐకు చెందిన ఏటీఎం ద్వారా రూ.9వేల నగదు ఎక్కువగా డ్రా అయినట్లు బ్యాంకు రికార్డుల్లో నమోదైంది. ఈమేరకు ఇద్దరి ఖాతాల్లో జమ అయినట్లు గుర్తించిన అధికారులు అందులో ఎం.శ్రీనును సోమవారం పిలిపించారు. డబ్బుల విషయమై ఆరా తీస్తుండగా తనకు రాలేదని చెప్పిన ఆయన వెళ్లిపోయాడు. మళ్లీ సాయంత్రం మద్యం మత్తులో వచ్చిన శ్రీను అధికారులు, సిబ్బందిత గొడవకు దిగారు. దీంతో పోలీసులు చేరుకుని ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ సాంకేతిక లోపంతో ఎదురైన సమస్యను వివరించేందుకు పిలిపించగా సిబ్బందితో దురుసుగా ప్రవర్తించాడని తెలిపారు.

సమస్యల పరిష్కారంపై స్పందించాలి

వైరా మున్సిపల్ చైర్మన్ జైపాల్



ఉద్యోగులతో సమావేశమైన చైర్మన్ జైపాల్

వైరా: మున్సిపాలిటీ పరిధిలోని నెలకొన్న సమస్యలపై అధికా రులు ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్కరించడం ద్వారా ప్రజలకు జవాబుదారీగా ఉండాలని వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ సూచించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం ఆయన ఉద్యోగులతో సమావేశమయ్యారు. వేసవి నేపథ్యాన తాగునీటి ఎద్దడి ఎదురుకాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కాగా, వైరా మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పఠాని వెంకటేశ్వర్లు సోమవారం చైర్మన్ సూతకాని జైపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని చైర్మన్ సూచించారు.

వైన్స్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు

ఖమ్మంరూరల్: మండలంలోని పల్లెగూడెంలో ఉన్న వెంకటేశ్వర వైన్ షాప్‌లో సోమవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేశారు. మద్యాన్ని కల్తీ చేస్తున్నారని, బాటిళ్ల మూతలు తీసి నీళ్లు కలుపుతున్నారనే ఫిర్యాదులతో అధికారులు తనిఖీ చేసినట్లు తెలిసింది. ఈవందర్భంగా పలు మద్యం బాటిళ్ల నుంచి శాంపిళ్లు సేకరించారు.

మీరే ఆనందంగా ఉండండి.. నేనెళ్తున్నా

క్షణికావేశంలో వివాహిత ఆత్మహత్య



షాకీరాబేగం (ఫైల్)

సత్తుపల్లిటౌన్: నేను వెళ్లిపోతున్నా.. మీరే ఆనందంగా ఉండండి.. అంటూ భర్తకు ఫోన్ చేసిన ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సత్తుపల్లిలోని కాకర్లపల్లిరోడ్డులో నివాసం ఉంటున్న షేక్ షాకీరాబేగం(35)కు కారు మెకానిక్ ముజీబ్‌తో 13 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. షాకీరా మెహిందీ ఈవెంట్లకు వెళ్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. అయితే, మద్యానికి బానిసైన ముజీబ్ డబ్బు కోసం ఆమెతో గొడవ పడేవాడు. ఆదివారం రాత్రి కూడా గొడవ జరగగా ఇద్దరు కుమారులు సాహిల్, ఆహిల్‌ను తీసుకొని భర్త బయటకు వెళ్లాడు. దీంతో క్షణికావేశానికి గురైన షాకీరా తన భర్తకు ఫోన్ చేసి 'మీ ముగ్గురు ఆనందంగా మంచిగా ఉండండి..' అని చెప్పేసి ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో కంగారుగా ముజీబ్ వచ్చేసరికి తలుపులు వేసి ఉండడంతో పగులగొట్టి షాకీరాను ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సోమవారం మృతురాలి సోదరి సబియా చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.రాము తెలిపారు.

భూవివాదంలో కత్తితో దాడి

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్లలో భూవివాదంతో ఓవ్యక్తిపై కత్తితో దాడి చేశారు. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, బాలకృష్ణ నడుమ స్థలం విషయమై కొన్నాళ్లుగా వివాదం కొనసాగుతోంది. సోమవారం సాయంత్రం కూడా గొడవ జరగా వెంకటేశ్వర్లుపై బాలకృష్ణ కత్తితో దాడి చేయడంతో తీవ్రగాలయ్యాయి. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి

- తల్లి ప్రియుడే హత్య చేశాడని అనుమానాలు
- భర్తను వదిలేసి మరొకరితో ఉంటున్న బాలిక తల్లి



శ్రీవల్లి (ఫైల్)

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని చర్చి కౌంపాండ్ ప్రాంతంలో సోమవారం ఓ బాలిక(12) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఉద్రిక్తతకు దారి తీసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడు గోల్‌తండాకు చెందిన బానోత్ గంగ, బీకూకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలం క్రితం భర్తను వదిలేసిన గంగ ఖమ్మం వచ్చి వినోద్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. చర్చి కౌంపాండ్ వద్ద పిల్లలు శ్రీవల్లి(12) చరణ్‌తో ఉంటూ వైన్స్ వద్ద జొన్న రొట్టెలు అమ్ముకుంటూ జీవిస్తుండగా.. శ్రీవల్లి ఆరో తరగతి చదువుతోంది.

సీపీఆర్ చేసినా దక్కని ప్రాణం

గంగ ఉదయమే రోజు మాదిరిగానే సోమవారం ఉదయం ఇళ్లలో పనికి వెళ్లింది. అనంతరం కింద అంతస్తులో ఉండే మహిళ గంగ ఇంటికి వెళ్లగా ఫ్యాన్‌కు వేలాడుతూ శ్రీవల్లి కనిపించింది. దీంతో ఆమె కేకలు వేయగా చుట్టుపక్కల వారు చేరుకుని కిందకు దించి గంగకు సమాచారం ఇచ్చారు. అప్పటికే అపస్మారక స్థితిలోకి చేరుకున్న శ్రీవల్లికి స్థానిక హోంగార్డ్ రవి సీపీఆర్ చేయగా కొంతవరకు ఊపిరి ఆడినట్లు తెలిసినా.. జిల్లా ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

తల్లి ప్రియుడిపై అనుమానం

శ్రీవల్లి మృతి చెందిన సమాచారం తెలుసుకున్న ఆమె తండ్రి బీకూ, బంధువులు జిల్లా ఆస్పత్రికి చేరుకుని గంగపై దాడి చేశారు. తన ప్రియుడు వినోద్‌తో కలిసి ఆమే శ్రీవల్లికి ఉరి వేసిందని ఆరోపించారు. మొదట ఇంట్లో ఎవరూ లేరని చెప్పిన గంగ కాసేపటికి వినోద్ ఉన్నాడని చెప్పడంతో మరింత మండిపడ్డారు. తమ సహజీవనానికి అడ్డు వస్తుందని శ్రీవల్లిని అడ్డు తొలగించేందుకు గంగ, ఆమె ప్రియుడు పథకం ప్రకారం హత్య చేశారని ఆరోపించారు. గంగ కుమారుడు చరణ్‌ను కూడా వినోద్ తీవ్రంగా కొడుతుండడంతో నెల క్రితం గోల్ తండాలోకి తండ్రి వద్దకు వెళ్లాడు. కాగా, గంగ ఇంట్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న లెటర్‌లో 'నాకు బతకాలని లేదు.. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నా' అని రాసినట్లు తెలుస్తుండగా శ్రీవల్లిని కొట్టి బలవంతంగా రాయించారా, లేక వినోద్ రాశాడా అనేది తెలియరాలేదు. శ్రీవల్లి స్థానికులతో మంచిగా ఉండేదని, టీవీలో చూసి భరతనాట్యం నేర్చుకున్న ఆమె చిన్నారులకు నేర్పించేదని చెబుతున్నారు. ఆమె మృతి చెందినట్లు తెలియగానే వినోద్ కనిపించకుండా పోవడంతో శ్రీవల్లి తండ్రి బీకూ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ స్వామి తెలిపారు. అయితే, గంగ, ఆమె ప్రియుడు వినోద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

చట్టాలకు రామోజీ అతీతుడా..!

▶ మొదటి పేజీ తరువాయి

ఫైనాన్షియర్స్ వ్యవహారంలో... ఆ కంపెనీ ద్వారా తాము చేసినవన్నీ చట్ట విరుద్ధమైన పనులే అని తేలటంతో... తప్పును కప్పిపుచ్చుకోవటానికి ఏకంగా ఆ సంస్థనే మూసేశారు. ఇపుడు ఆ సంస్థే లేదు కదా? అని వాదిస్తున్నారు. ఒక బ్యాంకు తన వద్దకు వచ్చిన డిపాజిట్లను ఇష్టం వచ్చినట్లు సొంత అవసరాల కోసం వాడేయొచ్చా? సొంత కంపెనీల్లోకి మళ్లించొచ్చా? అలా మళ్లిస్తే బ్యాంకు కుప్పకూలిపోదా? కృషి, చార్మినార్, ప్రుడెన్షియల్ బ్యాంకుల నుంచి బిచాణా ఎత్తేసిన బ్యాంకులన్నీ ఇలా చేసినవే కదా?

మార్గదర్శి చిట్స్‌లో ప్రస్తుతం వేలకోట్ల రూపాయల మనీ లాండరింగ్, అక్రమ నిధుల మళ్లింపు జరుగుతున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరుపుతోంది. నిజాలు బయటికొస్తున్నాయి. కానీ దీన్ని ఈ నిజాలు వెలుగుచూడకుండా 86 ఏళ్ల రామోజీరావు కొత్త నాటకానికి తెరతీశారు. 'ఈనాడు' పత్రికను అడ్డంపెట్టుకుని, తటస్థుల ముసుగులో తన వాళ్లను తెరపైకి తెస్తున్నారు. అడ్డగోలు బుకాయింపులకు దిగుతున్నారు. మార్గదర్శిపై ఏ ఒక్క ఫిర్యాదూ రాలేదు కదా? అలాంటపుడు సీఐడీ విచారణ ఎందుకంటున్నారు. 'ఈనాడు' పత్రికలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు వస్తున్నందుకే ప్రభుత్వం కక్ష గట్టి ఇలా చేస్తోందని... తన వాళ్లచేత కేంద్రానికి లేఖలు కూడా రాయిస్తున్నారు.

ఇక్కడ మార్గదర్శిలో చిట్లు వేస్తున్నవారు, డిపాజిటర్లు గమనించాల్సింది ఒక్కటే. యావత్తు దేశాన్ని కుదిపేసి దివాలా తీసిన శారదా చిట్‌ఫండ్స్‌గానీ, వేల మందిని ముంచేసిన సుదర్శన్ చిట్స్ గానీ కూలిపోవటానికి ముందు చాలా బలంగా కనిపించినవే కదా? కూలిపోయేదాకా వాటిపై ఎవ్వరూ ఎలాంటి ఫిర్యాదులూ చేయలేదే!!. ఎవ్వరూ ఫిర్యాదు చేయకపోబట్టే... చట్టాలు ఉల్లంఘిస్తున్నా అక్కడి ప్రభుత్వాలు పట్టించుకోకపోవటం వల్లే అవి కుప్పకూలాయి. వేల మంది దాచుకున్న కష్టార్జితాన్ని స్వాహా చేసేశాయి. ఇలాంటి పరిస్థితుల్లో మార్గదర్శి చిట్స్‌ను... చట్టప్రకారం నడుచుకోవాలని కోరటం తప్పా? చట్టాలను అనుసరించాలని అడగటం నేరమా? ఇదెక్కడి తీరు!!.

అయినా డిపాజిట్లు సేకరించకూడదన్న ఆర్‌బీఐ నిబంధనల్ని ఉల్లంఘించినందుకు ఎన్ని ఎన్‌బీఎఫ్‌సీలు మూతపడలేదు? కనీసం మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎన్‌బీఎఫ్‌సీ కూడా కాదు. ఒక 50 మంది చిట్ సభ్యులుంటే... ప్రతినెలా ప్రతి ఒక్కరి దగ్గరా సొమ్ములు వసూలు చేసి.. వాటిని చిట్ పాడుకున్న ఎవరో ఒక్కరికి ఆ నెల్లోనే ఇవ్వటం దాని పని. మరి ప్రతినెలా అలా ఎవరి చిట్ల డబ్బులు వాళ్లకు ఇచ్చేస్తున్నపుడు వేల కోట్ల రూపాయల మిగులు మొత్తాలు దానిదగ్గర ఎలా ఉంటాయి? వాటిని తన సొంత సంస్థల్లోకి మళ్లించే అధికారం ఎవరిచ్చారు? వాటిని స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్‌చేసే అధికారం ఎక్కడి నుంచి వచ్చింది? ఇవన్నీ ఉల్లంఘనలు కావా?

పత్రికాధిపతి... వ్యాపారవేత్త అనే రెండు టోపీల్ని రామోజీరావు ధరిస్తుంటారని... వ్యాపారాల్లో అక్రమాలేవైనా బయటపడినపుడు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోబో యినపుడల్లా... అది పత్రికా స్వేచ్ఛపై దాడి అంటూ ఎదురుదాడికి దిగుతారని సాక్షాత్తూ ఈ దేశ సర్వోన్నత న్యాయస్థానమే గతంలో చెప్పింది. గతమంతా రామోజీ చేసింది ఇదే. కాకపోతే ఇపుడలా మాటలు పనిచేయటం లేదు. నమ్మేవారెవరూ లేరు. దీంతో ఆ మాటలు తాను చెప్పకుండా... తటస్థుల ముసుగులో తనకు కొమ్ముకాసే కొందరితో చెప్పిస్తున్నారు. అయినా అక్రమాలు చేస్తున్న మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై చర్యలు తీసుకుంటుంటే మధ్యలో ఈ తటస్థులెవరు? వీళ్లేమైనా మార్గదర్శిలో చిట్లు వేస్తున్నవారా? వీళ్లకేం సంబంధం? వీళ్లకసలు అక్రమాలకు పాల్పడుతున్న రామోజీని రక్షించే బాధ్యతను ఎవరిచ్చారు? రామోజీరావా... చంద్రబాబు నాయుడా?

ఈ చట్టాలు చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాదే?

కేంద్ర చిట్‌ఫండ్ చట్టం-1982, రాష్ట్ర డిపాజిట్ దారుల హక్కుల పరిరక్షణ చట్టం-1999లను ఉల్లంఘించి నిధులు మళ్లించినట్టు, అక్రమ డిపాజిట్లు సేకరించినట్టు స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ సోదాల్లో ఆధారాలతో సహా వెల్లడైంది. చందాదారులు, డిపాజిట్‌దారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఆ శాఖ అధికారుల ఫిర్యాదుతో సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. దీన్ని వక్రీకరిస్తూ రామోజీరావు మీడియా, చంద్రబాబు పార్టీ గగ్గోలు పెడుతున్నాయి. నిజానికి ఈ రెండు చట్టాలూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసినవేమీ కావు. చిట్‌ఫండ్ చట్టాన్ని కేంద్రం 1982లో రూపొందించింది. ఇక ఏపీ డిపాజిటర్ల హక్కుల పరిరక్షణ చట్టాన్ని తెచ్చింది 1999లో చంద్రబాబు ప్రభుత్వమే. వాటిని అమలు చేస్తుంటే... దాన్ని రామోజీరావుపై వేధింపులుగా వక్రీకరిస్తున్నారు.

చిట్‌ఫండ్ చట్టాన్ని ఉల్లంఘిస్తే ఆ తరవాత దివాలాయే!!

చిట్‌ఫండ్ చట్టాన్ని, డిపాజిటర్ల చట్టాన్ని ఉల్లంఘిస్తే ఏమవుతుందన్నట్టుగా రామోజీరావు, ఆయన మనుషులు, టీడీపీ ప్రజల్ని తప్పుదోవపట్టించే ప్రయత్నం చేస్తున్నాయి. సామాన్యుల డబ్బు భద్రంగా ఉండటం కోసం చేసిన ఆ చట్టాలను ఉల్లంఘిస్తే ఏమవుతుందో... దేశంలో బట్టబయలైన ఎన్నో చిట్‌ఫండ్ కుంభకోణాలు, ప్రైవేట్ బ్యాంకుల ఆర్థిక దోపిడీలు నిరూపించాయి కూడా...

శారదా చిట్‌ఫండ్... 4.90 లక్షల కోట్ల భారీ దోపిడీ

2013లో బట్టబయలైన శారదా చిట్‌ఫండ్ కుంభకోణం దేశంలోనే సంచలనం సృష్టించింది. పశ్చిమ బెంగాల్, అసోం, త్రిపురలలో డిపాజిట్‌దారుల నుంచి ఏకంగా 4.90 లక్షల కోట్ల అక్రమ డిపాజిట్లు సేకరించింది. అధికవడ్డీల ఆశ చూపించి పోంజీ తరహా మోసానికి పాల్పడింది. 2013లో శారదా చిట్‌ఫండ్ సంస్థ బోర్డు తిప్పేయడంతో ఏకంగా 17 లక్షల మంది ఆ సంస్థ ఖాతాదారులు నిండా మోసపోయారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ కూడా పోంజీ తరహా మోసానికే పాల్పడుతోందని స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ సోదాల్లో వెల్లడి కావడం గమనార్హం.

రూ. 6,380 కోట్ల అగ్రిగోల్డ్ కుంభకోణం

చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో వెలుగుచూసిన మరో ఆర్థిక మోసం అగ్రిగోల్డ్. గొలుసుకట్టు తరహాలో 8 రాష్ట్రాల్లో ఏకంగా రూ.6,380 కోట్ల డిపాజిట్లు సేకరించింది. అందులో రూ.3,996 కోట్ల డిపాజిట్లు ఆంధ్రప్రదేశ్‌లో సేకరించినవే. ఇష్టం వచ్చినట్లుగా నిధుల్ని మళ్లించి సంస్థ బోర్డు తిప్పేసింది. ఫలితం... కష్టార్జితాన్ని దాచుకున్న 32 లక్షల మంది డిపాజిట్‌దారులు రోడ్డునపడ్డారు. వారిలో అత్యధికంగా 19.50 లక్షలమంది ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారే. అగ్రిగోల్డ్ సంస్థ అక్రమాలకు పాల్పడుతోందని గుర్తించినా నాటి చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆ సంస్థకు చెందిన హాయ్‌లాండ్‌తోపాటు అమరావతిలో భూములను కొల్లగొట్టేందుకే చంద్రబాబు, లోకేశ్ ప్రాధాన్యమిచ్చారు. ఈ ప్రభుత్వం వచ్చాక దశలవారీగా డిపాజిటర్లకు చెల్లింపులు చేస్తూ వస్తోంది.

పాతికేళ్ల కిందటే... 'కృషి' బ్యాంకు

చంద్రబాబు సీఎంగా ఉండగా 2001లో కృషి బ్యాంకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఖాతాదారులను బురిడీ కొట్టించింది. అత్యధిక వడ్డీల ఆశ చూపించిన ఈ బ్యాంకు చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు... రూ.35 కోట్ల డిపాజిట్లను కొల్లగొట్టారు. అనధికారిక లెక్కల ప్రకారం ఈ డిపాజిట్లు రూ.100 కోట్లకుపైనే ఉంటాయని సమాచారం. కొసరాజు ఆ నిధులను ఇతర సంస్థల్లోకి అక్రమంగా మళ్లించి చివరికి 2001లో చేతులెత్తేసి విదేశాలకు పారిపోయాడు.

ప్రుడెన్షియల్... పాపులర్.. ఏదైనా అంతే..

చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే 2003లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో వెలుగు చూసిన మరో భారీ ఆర్థిక మోసం... ప్రుడెన్షియల్ బ్యాంకు. ఏకంగా రూ.550 కోట్ల మేర డిపాజిట్‌దారులను మోసం చేసింది ఆ సంస్థ. ఇక కేరళ కేంద్రంగా డిపాజిట్లు సేకరించిన పాపులర్ ఫైనాన్స్ సంస్థ ఏకంగా రూ.2వేల కోట్లమేర డిపాజిటర్లను మోసం చేసింది. కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో 274 బ్రాంచ్‌లతో కార్యకలాపాలు సాగించిన ఈ సంస్థ 2022లో బోర్డు తిప్పేసి డిపాజిటర్లను ముంచేసింది.

వీటన్నింటినీ మించిపోయిన మార్గదర్శి...

పైన పేర్కొన్న సంస్థలను తలదన్నే రీతిలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతోందని ఆధారాలతో సహా వెల్లడైంది. స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు గత ఏడాది నవంబర్, డిసెంబర్‌లలో మార్గదర్శి చిట్స్ కార్యాలయాల్లో నిర్వహించిన సోదాల్లో ఈ అక్రమాలు వెలుగుచూశాయి. అనంతరం సీఐడీ అధికారులు ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన సోదాల్లోనూ ఈ అక్రమాలు ధ్రువపడ్డాయి.

■ **రశీదు ముసుగులో అక్రమ డిపాజిట్లు:** చందాదారులు పాడిన చిట్ మొత్తాన్ని వారికి వెంటనే చెల్లించడం లేదు. ఆ మొత్తంపై 4 నుంచి 5 శాతం వరకు వడ్డీ చెల్లిస్తామని చెబుతూ ఓ రశీదు ఇస్తున్నారు. అంటే మార్గదర్శి సంస్థ ఆ చిట్ మొత్తాన్ని డిపాజిట్‌గా స్వీకరిస్తోంది. ఇది రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు విరుద్ధం. చిట్‌ఫండ్ కంపెనీలు డిపాజిట్లు స్వీకరించడం నేరం. మార్గదర్శి చిట్స్ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా 'ప్రత్యేక రశీదు' ముసుగులో డిపాజిట్లు సేకరిస్తోంది. ఈ అక్రమ డిపాజిట్లు ఎన్ని వేల కోట్లు అన్నది లెక్కతేలాల్సి ఉంది.

■ **గతంలో రూ.15వేల కోట్ల అక్రమ డిపాజిట్ల సేకరణ:** మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట అక్రమ డిపాజిట్లు సేకరించిన నేర చరిత్ర మార్గదర్శి గ్రూపునకు ఉంది. గతంలో అక్రమంగా సేకరించిన రూ.15వేల కోట్ల డిపాజిట్లపై ఆదాయపన్ను చెల్లించాలని ఆదాయపన్ను శాఖ నోటీసులు కూడా ఇచ్చింది. దాంతో హడావుడిగా మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను మూసేశారు. కేసు దర్యాప్తులో ఉండగా సంస్థను మూసివేయడం అంటే ఆధారా లను ధ్వంసం చేయడమే. అది క్రిమినల్ నేరం.

■ **చందాదారుల సొమ్ము సొంత పెట్టుబడిగా...:** మార్గదర్శి చిట్స్‌కు మూడు అనుబంధ కంపెనీలున్నట్టుగా బ్యాలెన్స్ షీట్లో పేర్కొన్నారు. మార్గదర్శి చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్-చెన్నై, మార్గదర్శి చిట్స్ (కర్ణాటక) ప్రైవేట్ లిమిటెడ్-బెంగళూరు, ఉషా కిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్- హైదరాబాద్‌లను అనుబంధ కంపెనీలుగా చూపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిధులను మళ్లించడానికే ఈ కథ. ఒక్క ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లోనే 88.5 శాతం వాటాకోసం పెట్టుబడి పెట్టినట్టు నిర్ధారణ అయ్యింది. అంటే రామోజీరావు కుటుంబం రూపాయి పెట్టకుండా...చందాదారుల సొమ్ముతోనే సొంత వ్యాపారాలు చేస్తున్నారు. అసలు చిట్ ఫండ్ కంపెనీలు ఇతర వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టడం చిట్ ఫండ్ చట్టం-1982కు విరుద్ధం.

■ మార్గదర్శి చిట్స్ కార్యాలయాల నుంచి భారీగా నిధులను మార్గదర్శి ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ఆ నిధులను మార్గదర్శి యాజమాన్యం మార్కెట్ రిస్క్ అత్యధికంగా ఉండే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడిగా పెడుతోంది. ఇది చిట్ ఫండ్ చట్టానికి విరుద్ధం.

■ **రికార్డుల కనికట్టు...:** చట్ట విరుద్ధంగా చేస్తున్న ఈ మోసాన్ని కప్పిపుచ్చేందుకు మార్గదర్శి చిట్స్ రికార్డుల్లో భారీ అవకతవకలకు పాల్పడుతోంది. చందాదారుల సొమ్ము చెక్కుల రూపంలో తమ వద్ద ఉన్నట్టుగా బ్యాలెన్స్‌షీట్‌లో చూపిస్తోంది. ఏటా మార్చి 31న వందల కోట్ల రూపాయలు చెక్కులు వచ్చినట్టు చూపిస్తోంది. కానీ ఆ చెక్కులు ఎన్నిరోజులైనా క్యాష్ కావు. అంటే... అవి బోగస్ చెక్కులన్నమాట. అప్పటికే ఆ సొమ్మును మనీ లాండరింగ్ చేసేశారన్నది స్పష్టంగా తెలియకమానదు.

■ **ఏపీ ప్రజల సొమ్ము... పెత్తనం పక్క రాష్ట్రంలో:** రాష్ట్రంలో మార్గదర్శి చిట్స్‌కున్న 37 బ్రాంచిల్లో ఏడు బ్రాంచిల్లో చందాదారులు చెల్లించిన మొత్తం అక్కడి బ్యాంకుల్లో లేదు. ఆ సొమ్మంతా నిబంధనలకు విరుద్ధంగా పక్క రాష్ట్రానికి తరలించేస్తున్నారు. రాష్ట్రంలోని మార్గదర్శి ఫోర్‌మెన్‌కు చట్ట ప్రకారం ఉండాల్సిన చెక్ పవర్‌తో సహా ఎలాంటి అధికారాలూ లేవు. బ్యాంకు వ్యవహారాలు, చెక్ పవర్ అంతా హైదరాబాద్‌లోని మార్గదర్శి ఎండీ శైలజతో పాటు ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలోని 11 మందికే ఉంది. ఇక్కడి చందాదారుల సొమ్ము భద్రత గురించి అడిగితే తనకు తెలియదని ఫోర్‌మెన్ చెబుతున్నారు. హైదరాబాద్ వెళ్లి అడిగితే... తెలంగాణలో ఉంది కనక అది ఏపీ అధికారుల పరిధిలోకి రాదని చెబుతున్నారు. మరీ ఏపీ చందాదారుల సొమ్ముకు బాధ్యులెవరని అడిగితే... సమాధానం లేదు.

■ **ఒక్క బ్యాంకు ఖాతా చాలట...:** చిట్‌ఫండ్ సంస్థలు తాము నిర్వహించే ప్రతి చిట్టీకీ సంబంధిత బ్యాంకు ఖాతా వివరాలివ్వాలి. మార్గదర్శి దీన్ని పట్టించుకుంటే ఒట్టు. అన్ని చిట్లకూ ఒకే బ్యాంకు ఖాతా. ఏపీకి సంబంధించి ప్రత్యేక ఖాతా కూడా లేదు.

■ **ఇదో పోంజీ తరహా స్కామ్:** మార్గదర్శి చిట్స్ పోంజీ స్కీమ్‌కు తక్కువేమీ కాదు. చిట్లలో 30 - 40% టికెట్లు (సభ్యత్వాలు) యాజమాన్యానివే. వాటికి తన తరఫున చెల్లించాల్సిన చందాలను చెల్లించడం లేదు. కొత్త చిట్లు, ఇతర చిట్ల నుంచి వచ్చిన సొమ్మును తాము చెల్లించినట్టుగా రికార్డుల్లో చూపిస్తోంది. వాటిపై మళ్లీ 5 శాతం కమీషన్ తీసుకుంటోంది. అంటే... ఏ రోజైనా కొత్తగా వచ్చే చందాదారులు తగ్గినా, కొత్త చిట్లు ఆగినా మార్గదర్శి తన తరఫున చెల్లించాల్సిన చందాను చెల్లించే పరిస్థితి ఉండదు. అప్పుడు చిట్ పాడుకున్నవారికి సొమ్ము చెల్లించే అవకాశమూ ఉండదు. అదేరోజున దివాలా తీసే ప్రమాదం ఉంటుంది.

ఒక్క రూపాయి చెల్లించకుండా...తమపేరిట చిట్టీలు

సాధారణంగా ప్రతి చిట్‌కూ నిర్దేశిత చందాదారుల సంఖ్య ఉంటుంది. కొన్ని గ్రూపుల్లో తక్కువ మంది సభ్యులు (టికెట్లు) చేరితే కొన్ని ఖాళీగా ఉండిపోతాయి. ఆ ఖాళీ టికెట్స్‌ను కంపెనీ తీసుకోవాలి. వాటి చందాను కంపెనీ చెల్లించాలి. తరవాత కొత్త చందాదారులు చేరితే ఆ మేరకు టికెట్స్ భర్తీ చేయొచ్చు. చిట్‌ఫండ్ చట్టంలోని ఈ నిబంధనలను మార్గదర్శి ఏనాడూ పట్టించుకోలేదు. గరిష్ఠంగా ఒకో గ్రూపులో 50 శాతం వరకూ టికెట్లు కంపెనీవే ఉన్నాయి. వాటికోసం మార్గదర్శి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. చిట్లపై తమకు వచ్చే డిస్కౌంట్ల మొత్తాన్ని డూప్లికేట్ చేసి అన్నిచోట్లా రికార్డుల్లో చూపిస్తోంది.

నిధులు మళ్లించామని అంగీకరించిన రామోజీ

సీఐడీ దర్యాప్తులో... తాము మార్గదర్శి చిట్స్ నిధులను ఇతర సంస్థలకు మళ్లించామని రామోజీరావే అంగీకరించారు. ఆధారాలతోసహా సీఐడీ అధికారులు ప్రశ్నించేసరికి ఆయన నోటమాట రాలేదు. దాంతో నిధులు మళ్లించింది వాస్తవమేనని అంగీకరిస్తూనే అది తమ ఆర్థిక ప్రణాళిక అన్నట్టుగా బుకాయించేందుకు ప్రయత్నించారు. ఈ కేసులో ఏ-1గా ఉన్న రామోజీరావే అక్రమాలు నిజమేనని సమ్మతించిన తరువాత ... మళ్లీ వక్రీకరిస్తూ వితండవాదనలెందుకు?

చట్టాలు తమకు వర్తించవన్న శైలజ...

మామ కంటే రెండు ఆకులు ఎక్కువ చదివానన్నట్టుగా ఏ-2 చెరుకూరి శైలజ వ్యవహరించారు. అసలు చిట్‌ఫండ్ చట్టం తమకు వర్తించదని...తాము పట్టించుకోమని ఆమె సీఐడీ అధికారుల వద్దే వ్యాఖ్యానించడం తీవ్రమైన అంశమని నిపుణులు చెబుతున్నారు. కంపెనీల చట్టాన్ని అనుసరిస్తున్నామన్న ఆమె... పోనీ ఆ చట్ట ప్రకారమైనా అనుబంధ కంపెనీలకు నిధులు మళ్లించడం నేరమే కదా అని అంటే మాత్రం సమాధానమివ్వలేదు.

క్లుప్తంగా...

రెవెన్యూశాఖకు దిక్సూచి భూమి మేనిఫెస్టో

- సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నిరూప్‌రెడ్డి
- భూదాన్ పోచంపల్లిలో భూమి కారవాన్ పాదయాత్ర-2 ప్రారంభం



పాదయాత్రను నిర్వహిస్తున్న ప్రతినిధులు

భూదాన్ పోచంపల్లి: లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్ సొసైటీ (లీఫ్స్) సంస్థ 2014లో రూపొందించిన భూమి మేనిఫెస్టో రెవెన్యూ శాఖకు దిక్సూచి లాంటిదని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నిరూప్‌రెడ్డి అన్నారు. సోమ వారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని వినోబాభావే మందిరం వద్ద నుంచి లీఫ్స్ ఆధ్వర్యంలో భూమి కారవాన్ పాదయాత్ర-2ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరూప్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రెవెన్యూ రికార్డుల్లోని తప్పులను సరిదిద్దక ముందే డిజిటలైజ్ చేయడం వల్ల రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. భూ సమస్యల పరిష్కారానికి కోర్టుల చుట్టూ తిరుగుతున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ సీనియ ర్ నేత కోదండరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్, ఎండోమెంట్, ఇనాం, వక్ఫ్ భూములను అమ్ముకుంటోందని దుయ్యబట్టారు. సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా గాంధీజీ ఆధ్వర్యంలో నాడు బిహార్‌లోని చంపారణ్‌లో మొదలైన రైతుల ఉద్యమం తరహాలో తెలంగాణలోనూ ఉద్యమం రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

జూన్ 2న ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాం: లీఫ్స్ అధ్యక్షుడు సునీల్

రెవెన్యూ చట్టాలు, విధానాల్లో చేయాల్సిన మార్పులపై సమగ్ర ప్రణాళిక రూపొందించి జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున ప్రభుత్వానికి నివేదిస్తామని లీఫ్స్ సంస్థ అధ్యక్షుడు, రెవెన్యూ చట్టాల నిపుణుడు ప్రొఫెసర్ సునీల్‌కుమార్ చెప్పారు. అంతకు ముందు ఆచార్య వినోబాభావే, వెదిరె రాంచంద్రారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన నివాళులు అర్పించారు. వినోబాభావే నడియాడిన జువ్వి చెట్టు వద్ద పూజలు చేశారు. అనంతరం దోతిగూడెంలో రైతులతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొన్నారు.

జిల్లా వార్తలు

ఖమ్మం డెయిరీ ప్రైవేటీకరణ?!

- నిర్వాహకుల అవినీతి, అక్రమాలే కారణం
- అధికారులను మార్చినా ప్రయోజనం లేక నిర్ణయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం ప్రభుత్వ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య(విజయ డెయిరీ)ని ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించాలని పాడి పరిశ్రమ ఉన్నతాధికారులు యోచిస్తున్నట్లు సమాచారం. దశాబ్దాలుగా పాడి పరిశ్రమలో అవినీతి అక్రమాలు చోటు చేసుకోవటం, అధికారులను మార్చినా మార్పు లేకపోవటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఉన్న వనరుల ఆధారంగా 50 ఏళ్ల క్రితం ఖమ్మం జిల్లా కేంద్రంలో సుమారు పదెకరాల స్థలంలో 50 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన డెయిరీని ఏర్పాటుచేశారు. దీంతో పాటు ఆవరణలోనే అధికారులు, ఉద్యోగుల నివాస గృహాలను కూడా నిర్మించారు. ఈ డెయిరీ పరిధిలో ఉమ్మడి జిల్లాలోని పది ప్రాంతాల్లో బల్క్ మిల్క్ సెంటర్ ఏర్పాటుచేయగా తొలినాళ్లలో కొంత కాలం లక్ష్యం మేరకు పాల సేకరణ జరిగింది.

నానాటికీ తీసికట్టు...

మొదట్లో ఖమ్మం డెయిరీ ద్వారా పాలసేకరణ బాగానే జరిగినా ఆతర్వాత భ్రష్టు పట్టింది. రూ.లక్షల విలువైన పాలు, పదార్థాలు పక్కదారి పడుతుండగా, ఉమ్మడి జిల్లాలో ప్రైవేట్ డెయిరీలు ప్రవేశించడంతో లక్ష్యం నీరుగారింది. ప్రభుత్వ డెయిరీలో నిర్వహణ లోపాలను అందిపుచ్చుకున్న ప్రైవేట్ డెయిరీలు లాభాల బాట పట్టాయి. ఉమ్మడి జిల్లాలో 12 ప్రైవేట్ డెయిరీలు సుమారు 1.50 లక్షల లీటర్ల పాలను సేకరిస్తుండగా, ప్రభుత్వ డెయిరీ కేవలం 9,600 లీటర్లు మాత్రమే సేకరించగలుగుతోంది. ప్రభుత్వం పాల సేకరణ ధర పెంచినా, ప్రోత్సాహకాలు అందిస్తున్నా ఫలితం ఉండడం లేదు. దశాబ్దకాలంగా ఖమ్మం పాడి పరిశ్రమలో అవినీతి, అక్రమాలు రాజ్యమేలుతుండడంతో అధికారులను బదిలీలు చేయటం, అక్రమార్కులను సస్పెండ్ చేయటం వంటి చర్యలు తీసుకున్నా మార్పు రావటం లేదు. రెండేళ్ల కాలంలో నలుగురు డిప్యూటీ డైరెక్టర్లు, నలుగురు మేనేజర్లు, అనేక మంది ఉద్యోగులను బదిలీ చేయడంతో పాటు కొందరిని సస్పెండ్ చేశారు. అయినా ఇటీవల రూ.40 లక్షల విలువైన పాలు, వెన్న పక్కదారి పట్టాయి. ఇలా అక్రమాలు ఆగకపోవడంతో ఖమ్మం డెయిరీ నిర్వహణకు ప్రైవేట్ ఏజెన్సీ లేదా సొసైటీకి అప్పగించాలనే యోచనకు ఉన్నతాధికారులు వచ్చినట్లు సమాచారం. ఇటీవల ఆదిలాబాద్ డెయిరీని రైతు సొసైటీకి అప్పగించిన తరహాలోనే ఖమ్మం డెయిరీ విషయంలోనూ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.



ఖమ్మంలోని పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ

అక్రమార్కులను ఉపేక్షించేది లేదు

విజయ డెయిరీకి నష్టం కలిగేలా చూస్తున్న అక్రమార్కుల విషయంలో ఉపేక్షించేది లేదని సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ ఏ.కుమారస్వామి స్పష్టం చేశారు. ఖమ్మంలోని పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన అక్రమాల నేపథ్యాన నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేయడమే కాక విచారణ చేపట్టినట్లు తెలిపారు. అక్రమాల్లో ఏళ్లుగా ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న నలుగురు ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర ఉన్నట్లు తేలిందని చెప్పారు. తాజాగా నిర్వహణ లోపంతో రూ.75వేల విలువైన మిల్క్ పౌడర్ బ్యాగులు దెబ్బతిన్నాయని తెలిపారు. అలాగే, డెయిరీకి రోజూ వచ్చే 10 వేల లీటర్ల పాలలో వెయ్యి లీటర్ల మేర లెక్కలు ఉండడం లేదని చెప్పారు. ఇటీవల బదిలీపై వచ్చిన ల్యాబ్ టెక్నీషియన్ జ్యోతిని మిగతా వారు ఇబ్బంది పెట్టడంతో వెళ్లిపోయిందన్నారు. అలాగే, సిద్దిపేట నుంచి రావాల్సిన మేనేజర్లను అడ్డుకుంటున్నారని తెలిపారు. ఈనేపథ్యాన దీర్ఘకాలంగా పనిచేస్తున్న ముగ్గురు ఔట్ సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్లను సత్తుపల్లి, కొత్తగూడెంకు మార్చి ఇతరులను నియమించామని, సెక్యూరిటీ వ్యవస్థను కూడా మార్చే విషయమై సీపీతో చర్చించినట్లు డీడీ తెలిపారు.



నిర్వహణ లోపంతో దెబ్బతిన్న మిల్క్ పౌడర్

శరవేగంగా రైలు మార్గం సర్వే

నేలకొండపల్లి: డోర్నకల్ జంక్షన్ నుంచి మిర్యాలగూడెం వయా నేలకొండపల్లి మీదుగా కొత్త రైలు మార్గం నిర్మించేందుకు కేంద్రప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ నేపథ్యాన మండలంలో వారం రోజులుగా ప్రైవేట్ ఏజెన్సీ బాధ్యులు సర్వే చేస్తున్నారు. మండలంలోని గువ్వలగూడెం, నేలకొండపల్లి, ఆచార్లగూడెం, కోనాయిగూడెం, బోదులబండ, రామచంద్రాపురం మీదుగా కోదాడ వైపు సర్వే జరుగుతోంది. సంస్థ సిబ్బంది పంట పొలాలు, వ్యవసాయ బావులు, కాల్వలు, గుట్టలు, వంతెనలు, కల్వర్టులు వద్ద సర్వే చేస్తూ వివరాలు నమోదు చేస్తున్నారు. కాగా, సోమవారం కోనాయిగూడెం సమీపాన కొరటేస్ గుట్టపై మార్కింగ్ చేశారు.



కోనాయిగూడెం వద్ద సర్వే చేస్తున్న సిబ్బంది

హజ్ యాత్రకు 62 మంది

ఖమ్మంమయూరిసెంటర్: ముస్లింలు పవిత్రంగా భావించే హజ్‌యాత్రకు వెళ్లేందుకు ఉమ్మడి జిల్లా నుంచి 62 మందిని ఎంపిక చేసినట్లు హజ్ కమిటీ రాష్ట్ర సభ్యుడు, కార్పొరేటర్ షేక్ మక్బూల్ తెలిపారు. వీరిని లాటరీ పద్ధతిలో ఎంపిక చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 5,278 మందికి, ఉమ్మడి జిల్లా నుంచి 62 మందికి అవకాశం దక్కిందన్నారు. ఎంపికైన వారు యూనియన్ బ్యాంక్, ఎస్‌బీఐ ద్వారా రూ.81,800 చలానా చెల్లించి ఏప్రిల్ 12లోపు ఫిట్‌నెస్, కోవిడ్ వ్యాక్సిన్ ధృవపత్రాలు, పాస్‌పోర్ట్, బ్యాంక్ పాస్ బుక్, ఆన్‌లైన్ కాపీలను హైదరాబాద్‌లోని హజ్ హౌస్‌లో అందించాలని సూచించారు.

కట్టుదిట్టమైన బందోబస్తు



పరీక్ష కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర

మహబూబాబాద్ అర్బన్: పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని మహబూబాబాద్ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఫాతిమా హైస్కూల్‌లోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. తొలుత ఆయన తన సెల్‌ఫోన్ను సిబ్బందికి ఇచ్చి లోపలికి వెళ్లాక పరీక్ష తీరు తెన్నులను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది ఎవరు కూడా ఫోన్లు తీసుకెళ్లొద్దని సూచించారు. పరీక్ష సమయంలో పోలీసులు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎస్పీ వెంట ఇన్‌చార్జ్ డీఎస్పీ రమణబాబు, టౌన్ సీఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వరి పైర్లను పరిశీలించిన శాస్త్రవేత్తలు



వరిలో తెగుళ్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తల్లాడ: తల్లాడ మండలంలోని కుర్నవల్లిలో సోమవారం వరి పైర్లను వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు జే.హేమంత్‌కుమార్, డాక్టర్ కె.రవి కుమార్, వ్యవసాయాధికారి ఎం.డీ.తాజుద్దీన్ పైర్లను పరిశీలించి తెగుళ్ల నివారణపై రైతులకు సూచనలు చేశారు. రబీ వరిలో కాండం తొలిచే పురుగు, మెడ విరుపు తెగులు, సుడి దోమ, కంకి నల్లి ఉధృతిని గుర్తించినట్లు తెలిపారు. కాండం తొలిచే పురుగు నివారణకు చిరు పొట్ట దశలో ఉన్న వరి పైర్లలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు లేదా క్లోరాంత్ర విలిప్రోల్ 60 మి.లీ. లేదా టెట్రా విలిప్రోల్ 80 మి.లీ.ను ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. వాతావరణంలో తేమ అధికంగా ఉండటం, అధిక వర్షాలతో అగ్గి తెగులు ఆశిస్తోందని తెగులు ఉధృతిని గమనిస్తూ నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు.

రైతు సమస్యలు పరిష్కరించిన ఘనత కేసీఆర్‌దే..

ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు

మధిర: రైతుల సమస్యలను పరిష్కరించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. మధిర మండలం మాటూరుపేటలో సోమవారం జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమన్నారు. దేశవ్యాప్తంగా తెలంగాణలోనే పట్టణాలు, గ్రామాలు బాగున్నాయని కేంద్రప్రభుత్వం అవార్డులు ఇచ్చిందని తెలిపారు. ఇక నిరుపేద కుటుంబాల్లో యువతుల వివాహాలకు ఇబ్బంది ఎదురుకాకుండా కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న మల్లు భట్టి విక్రమార్క ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని కోరారు. ఈసమావేశంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు బొమ్మెర రామ్మూర్తి, నలమల వెంకటేశ్వరరావు, చిత్తారు నాగేశ్వరరావు, గుర్రం రామారావు, రావూరి శ్రీనివాసరావు, రావూరి శివ నాగకుమారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

'పింగిళి' డిగ్రీ ఫలితాలు విడుదల

విద్యారణ్యపురి: హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల(అటానమస్) బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను సోమవారం విడుదల చేశారు. కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి ఫలితాలను విడుదల చేసి వివరాలు వెల్లడించారు. మొత్తం 463 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 276 మంది(59.61 శాతం) మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పింగిళి కళాశాల పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రామకృష్ణారెడ్డితో పాటు రేణుక, శిరీష, సుహాసిని, పార్వతి, రాజేశ్వరి, గంప రజిత, మాధవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న మల్లారెడ్డి, తదితరులు

ప్రతీ గిరిజన కుటుంబానికి పథకాలు



గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న పీఓ గౌతమ్

భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు

భద్రాచలంటౌన్: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబానికి అందాలని.. తద్వారా జీవనోపాధి మెరుగయ్యేలా చూడాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ఆదివాసీ గిరిజన గ్రామాల నుంచి వచ్చిన వారి నుంచి ఆయన ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. అనంతరం పీఓ అధికారులతో సమావేశమై మాట్లాడుతూ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులకు పథకాలు అందేలా చూడాలని తెలిపారు. ఫిర్యాదులు, వినతులను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, అధికారులు సురేష్‌బాబు, శ్రీనివాస్, ప్రభాకర్‌రావు, ఆదినారాయణ, ప్రమీలాబాయి, దుర్గయ్య, వెంకటేశ్వర్లు, సుగుణ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.